పోషకాహారంపై విస్తృత ప్రచారం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు
- ఈనెల 22 వరకు కొనసాగింపు



చాగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా కార్యక్రమం(ఫైల్)

ఉండవెల్లి: పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు పోషకాహార ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలియజేసేందుకు 7వ విడత పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా ఈనెల 8న ప్రారంభమై 22వ తేదీ వరకు ముగించనున్నారు. విద్య, వైద్యా, ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బంది సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భావితరాల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో ..

నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలు 319 ఉన్నాయి. వాటిల్లో ఆరు నెలల నుంచి ఐదు సంవత్సారాల వయస్సు గల చిన్నారులు 20,811, గర్భిణులు 2,196 బాలింతలు 1,955, కిశోర బాలికలు 1,521 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతినెల పాలు, గుడ్లు, పోషకాహారం అందజేస్తున్నారు.



రాజోళిలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో అధికారులు(ఫైల్)

ఇంటింటా పోషణ సంబరాలు..

పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు పోషకాహారం ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలియజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏటా పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తుంది. పోషకాహార లోపం వలన కలిగే అనారోగ్య సమస్యలను తెలియజేస్తు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్రాల్లో వివిధ రకాల పోషకాహారం కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి అవగాహన కల్పిస్తున్నారు. రోజు వారీగా తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు, ఆకు కూరలు, పాలు, గుడ్లు, పండ్లు, మినుములు, పెసర్లు, రాగి జావా, బెల్లం, ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం..

పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నాం. తక్కువ బరువు కలిగిన పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి పోషకాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

- సుజాత, సీడీపీఓ మానవపాడు

నిరుద్యోగులను నిండా ముంచారు



మాట్లాడుతున్న పల్లయ్య

అయిజ: జాబ్ క్యాలెండర్ పేరుతో కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగులను నిండా ముంచారని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య విమర్శించారు . మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్వీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల్లో ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. 6వేలు ఉద్యోగాలు ఇచ్చి 60 ఉద్యోగాలు ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేని పక్షంలో వారి తరఫున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



చిన్నపాడులో ఏస్‌ఏ- 2 పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: మండల పరిధిలోని పెద్దపాడు, చిన్నపాడు గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఎస్‌ఏ -2 పరీక్షలు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారుర. విద్యార్థుల ఫలితాలు ఆన్‌లైన్‌లో పొందుపరచడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఫలితాలు ప్రకటించాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుడి కాల్వకు నీరు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గద్వాల: జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ కింద వరి సాగు చేస్తున్న రైతలకు నీటిని వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూరాల ప్రాజెక్టు కుడి కాలువ కింద రేవులపల్లి, గుంటిపల్లి, కొత్తపల్లి, తదితర గ్రామాలకు చెందిన రైతులకు వరి పంట సాగుచేస్తున్నారన్నారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి నీటి విడుదల ఆపడంతో పంటలు ఎండుముఖం పట్టి రైతన్నలు ఆందోళనలో ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పంటలకు నీటిని విడుదల చేసి రైతన్నలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరసింహ, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

గట్టు: మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన వడ్డే కేశన్న (57) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఆనంద్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు మహేశ్వర్‌రెడ్డి, సూర్యగౌడ్, నారాయణ, రామాంజనేయులు, వీరేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

అలంపూర్: మానవపాడు మండల కేంద్రానికి చెందిన చిన్న హుస్సేన్, ఇటిక్యాల మండలం వావిలాల గ్రామానికి చెందిన కాశీం అనారోగ్యంతో కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు వావిలాల రంగారెడ్డి, క్రాంతిరెడ్డి, రాము, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంపుసెట్ నిర్మాణానికి నిధులు మంజూరు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

గట్టు: చిన్నోనిపల్లె పునరావాస కేంద్రం వద్ద సంపు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.19 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. బల్గెర ఓహెచ్‌బీఆర్ నుంచి సప్లయ్ అవుతున్న మిషన్ భగీరథ నీరు చిన్నోనిపల్లె, అంతంపల్లి, ఈడిగోనిపల్లె, సంకాపురం గ్రామాలకు సక్రమంగా చేరలేకపోతున్న తరుణంలో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్ దృష్టికి తాగునీటి సమస్యను తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

‘భూ భారతిపై అవగాహన కల్పించండి’



నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న మోహన్‌రావు

నవాబుపేట: ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన భూ భారతి పోర్టల్‌పై రైతులకు అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డుల జారీ తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి పోర్టల్‌పై రెవెన్యూ సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త పోర్టల్‌లో వచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి.. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులకు పంపించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ ఉన్నారు.

రాజాపూర్: భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. అందులో భాగంగా భూ భారతి పోర్టల్ అందుబాటులోకి తీసుకువచ్చిందని మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలను కలిసి భూ భారతి అమలుపై హర్షం వ్యక్తంచేశారు. వారి వెంట రాములుగౌడ్, రాజేందర్‌రెడ్డి ఉన్నారు

‘సనాతన ధర్మమే శ్రీరామ రక్ష’



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వనపర్తిటౌన్: అనాది నుంచి ఉన్న సనాతన ధర్మ పరిరక్షణతోనే లోకం సుభిక్షంగా ఉంటుందని, హిందువులు ఐక్యమత్యంతో సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు భాగస్వాములు కావాలని జగద్గురు కాంతేంద్ర స్వామిజీ ప్రభోదించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతబజార్ కాశికాంబ సమేత కమలేశ్వర ఆలయ పునఃప్రతిష్ఠలో పాల్గొని ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మం వైభవాన్ని శ్రీరాముడు నిలబెట్టారని కొనియాడారు. సర్వమానవాళి, జీవరాశి సుభిక్షంగా, క్షేమంగా ఉండాలని ప్రతిరోజు ప్రార్థించే ఔన్నత్యం కలిగిన సనాతన ధర్మం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పుట్టిన రోజు వేడుకలతో సంబురాలు కాకుండా తోటివారికి తోడ్పాటునందించే చర్యలకు పూనుకోవడం ద్వారా మానవత్వ బీజానికి శ్రీకారం చుట్టినట్లు అవుతుందని చెప్పారు. హంగులు, ఆర్భాటాలు, అనవసర ఖర్చులు చేయకుండా నిశ్చల భక్తితో భగవంతుడిని ఆరాధించాలని తద్వార ధర్మ మార్గం అలవడుతోందన్నారు. సుప్రభాత సేవతో ప్రారంభించిన వేద పండితులు హోమాలు, విగ్రహ పంచామృత స్నానం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. పాత పట్టణమంతా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో మార్మోగింది. అంతకుముందు కమలేశ్వర స్వాముల ఊరేగింపు, పల్లకీ కనులపండువగా సాగింది. బుధవారం ఆలయంలో శ్రీకాశికాంబ సమేత కమలేశ్వరస్వామి మూర్తులను పునఃప్రతిష్ఠ చేయనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ధరూరు: మండల పరిధిలోని అల్వాలపాడులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సంఘం అధ్యక్షులతో కలిసి ఐకేపీ అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. దళారుల మోసాలకు గురికావద్దని ఐకేపీ ఏపీఎం శోభారాణి సూచించారు. కార్యక్రమంలో సీసీ నవీన్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



అయిజ: స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ జన్మదినం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీఆర్‌ఎస్‌వై నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వై నాయకుడు వీరేష్ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సత్యం, వీరన్న, మోహన్‌గౌడ్, తిమ్మప్ప, అనిల్, నరేష్, మత్తాలి తదితరులు పాల్గొన్నారు.

గట్టు: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ జన్మదిన వేడుకలు బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ, నడిగడ్డ యువత నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు అంగడి బస్వరాజు, నడిగడ్డ యువ నాయకులు, మోహన్‌గౌడ్, తిమ్మప్పగౌడ్, రామకృష్ణగౌడ్, నర్సింహులుగౌడ్, లచ్చగౌడ్, వీరేష్, శేఖర్, శంకర్‌గౌడ్, రాజేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మల్దకల్: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ముగిసిన చింతల మునిరంగస్వామి ఉత్సవాలు



అమరచింత: మండలంలోని పాత ఈర్లదిన్నెలోని జూరాల బ్యాక్ వాటర్‌లో వెలసిన చింతల మునిరంగస్వామి జాతర మంగళవారం ముగిసింది. సోమవారం రాత్రి ఈర్లదిన్నె నుంచి జూరాల బ్యాక్‌వాటర్‌లోని పాత ఈర్లదిన్నెలో ఉన్న ఆలయం వరకు రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మంగళవారం స్వామి వారికి పోటేళ్లను బలిచ్చి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి పిండివంటలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఆలయానికి గద్వాల, వనపర్తి జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడిందని ఆలయ పూజారి నాగిరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మల్దకల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని వంట ఏజెన్సీలకు సూచించారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కేటీదొడ్డి: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండల పరిధిలోని కొండాపురం, రంగాపురం తండా పాఠశాలలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీఆర్‌పీ, యుగంధర్, పాపయ్య, ఎల్లమ్మ, ప్రవీణ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు.. ప్రజల అవస్థలు



జోగుళాంబ స్టేషన్ వద్ద కొనసాగుతున్న మరమ్మతు పనులు



అలంపూర్ చౌరస్తాలో రోడ్డు మూసివేయడంతో నిలిచిన వాహనాలు

అలంపూర్: రైల్వే ట్రాక్‌పై మరమ్మతు పనుల కారణంగా వాహనాల దారి మళ్లింపుతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అలంపూర్ చౌరస్తా మార్గంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు మార్గంలో రైల్వే అధికారులు మంగళవారం మరమ్మతు చేపట్టారు. దీంతో తెల్లవారు జామున 5 గంటల నుంచి దాదాపు 7 గంటల వరకు ఈ మార్గంలోని వాహనాలను దారి మళ్లించారు. దీంతో ఉండవెల్లి, అలంపూర్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు జాతీయ రహదారిలోని రోడ్డు మార్గం ద్వారా గమ్య స్థానాలకు చేరుకున్నారు. తెల్లవారు జామున గ్రామాల్లో వ్యాపారాల నిమిత్తం వెళ్లాల్సిన చిరు వ్యాపారులు రోడ్డు మార్గం బంద్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లింపు మార్గం తెలియక ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల చేత పనులు చేయిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



చెన్నిపాడులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

మానవపాడు: మండలంలోని ఓ పాఠశాలలో ఆదివారం ‘విద్యార్థులే... పాఠశాలకు కార్మికులు’ సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంఈఓ శివప్రసాద్ మంగళవారం చెన్నిపాడు పాఠశాలను పర్యవేక్షించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ సభ విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ వజ్రోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీది చీకటి ఒప్పందం అని ఆరోపించారు. కాంగ్రెస్‌ను తిడితే బీజేపీ కోపం వస్తుందని, అలాగే బీజేపీని తిడితే కాంగ్రెస్‌కు కోపం వస్తుందని ఎద్దేవాచేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముద్దుబిడ్డ ఎలా అవుతాడని ప్రశ్నించారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడేది కేవలం కేసీఆర్ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మీడియా కన్వీనర్ అశోక్, గోపాల్‌పేట మండల అధ్యక్షుడు బాల్‌రాజు, తిరుపతయ్య, చంద్రశేఖర్, శేఖర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కజొన్న కుప్పకు నిప్పు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామంలో అచ్చులు మొక్కజొన్న కంకులు 40 క్వింటాళ్లకు పైగా కుప్ప పోసి పొలంలో నిల్వ ఉంచాడు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు కంకులు నిప్పు పెట్టి కాల్చడంతో పంట మొత్తం దగ్ధమైనట్లు అచ్చులు తెలిపారు. సుమారు రూ.70 వేలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరుతున్నాడు.

మిషన్ భగీరథ నీరు కలుషితం

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురంలో మిషన భగీరథ పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కలుషితమవుతోందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలోని వీవర్స్ కాలనీలో 10 రోజుల క్రితం గుంత తవ్వి వదిలేసిన ప్రదేశంలో పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. ఈ నేపథ్యంలో తాగునీరు కలుషితమవుతోందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

యువ వికాసానికి దరఖాస్తులు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ యువ వికాస పథకానికి మొత్తం 802 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తిరుపతన్న తెలిపారు. మంగళవారం దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: మండలంలోని మల్లెందొడ్డి, మల్దకల్, బిజ్వారం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు, చెట్ల కొమ్మ తొలగింపు తదితర పనుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్దకల్ ఏఈ రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గట్టు: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద విద్యుత్ స్తంభాల మార్పే పనులు, 11కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగించే పనులు చేపడుతున్నట్లు ఏడీఈ గోవిందు, ఏఈ చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.


అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పనులు పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు

శాంతినగర్: ఆన్‌లైన్‌లో పలువురితో క్రికెట్ ఆడిస్తున్న వీరేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన వీరేంద్రాచారి ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తుండటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. వీరేంద్రతోపాటు మరో 6 మందిపై విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. బెట్టింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబలి కేంద్రం ప్రారంభం



ఆత్మకూర్: పట్టణంలో వందే రామధూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అంబలి కేంద్రం ప్రారంభించారు. నిత్యం రాగి అంబలి పంపిణీ చేస్తున్నామని, వేసవి ముగిసే వరకు అంబలి కేంద్రం కొనసాగుతుందని నిర్వాహకులు ధర్మాపురం శ్రీనివాసులుశెట్టి, శివనారాయణ, గిరిధర్, పద్మ తెలిపారు.